క్లుప్తంగా

సురేష్‌కు గురుబ్రహ్మ పురస్కారం



కూనాటి సురేష్‌ను అభినందిస్తున్న హెచ్‌ఎం

రేణిగుంట : శ్రీకాళహస్తి మండలం ఊరందూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కూనాటి సురేష్‌కు మరో అరుదైన గౌరవం దక్కింది. విశాఖపట్నానికి చెందిన సెయింట్ మదర్ థెరిసా సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ వారు ఆయనను గురు బ్రహ్మ రాష్ట్ర అవార్డు- 2024కు ఎంపిక చేశారు. ఈ అవార్డును విశాఖపట్నంలో జరిగిన కార్యక్రమంలో సురేష్ అందుకోవాల్సి ఉండగా, ఆయన వెళ్లలేకపోవటంతో బుధవారం పోస్టు ద్వారా పంపించారు. పాఠశాలలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురా లు రాజకుమారి చేతుల మీదుగా ఈ అవార్డు ను అందుకున్నారు.

జ్వర పీడితులకు వైద్యపరీక్షలు

ఏర్పేడు(రేణిగుంట) : ఏర్పేడు మండలం మాధవమాలలో జ్వరాలు ఎక్కువగా ఉండటంతో ఏర్పేడు పీహెచ్‌సీ డాక్టర్ శివప్రియ ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈఓపీఆర్డీ రమణ కుమార్, పంచాయతీ కార్యదర్శి సుధాకర్ సయ్యద్ కరిముల్ల, చంద్రారెడ్డి, రవి నాయుడు పాల్గొన్నారు.

ముసలిపేడులో డిప్యూటీ డీఎంహెచ్‌వో తనిఖీ



సర్వేను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో

మండలంలోని ముసలిపేడు, సరస్వతి కండ్రిగలో నిర్వహించిన ఆరోగ్య శిబిరాన్ని జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ మృదులవాణి, జిల్లా మలేరియా అధికారి డాక్టర్ రూప్‌కుమార్ తనిఖీ చేశారు. పాపానాయుడుపేట పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ నాగరాజు, డాక్టర్ మధురిమ పాల్గొన్నారు.

దాతల చేయూత

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి పానగల్‌లో వెలసిన పొన్నాలమ్మ తల్లి దేవస్థానానికి వచ్చే భక్తులకు రక్షిత తాగునీరు అందించాలని దాతలను సాయం కోరినట్లు పొన్నాలమ్మ దేవస్థానం ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పుదూరు లక్ష్మణ్ రెడ్డి తెలిపారు. దాతలు మురళీకష్ణారెడ్డి , సంగీత దంపతులు, గోపీనాథ్ రెడ్డి, వాణి దంపతులు, తిరుక్కాల వెంకట ముని బాబు, బసీవి రెడ్డి, సుబ్బరామిరెడ్డి, ముని రామయ్య కుటుంబ సభ్యులు, సువర్ణం రవి వారి వంతు సాయం చేశారు. దీంతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను బుధవారం దాతలు చేతుల మీదుగా ప్రారంభించినట్లు ఆయన తెలిపారు. దేవస్థానం కార్యనిర్వాహక సభ్యులు, ఆలయ అర్చకుడు జగదీష్ పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలి

బుచ్చినాయుడుకండ్రిగ : పుత్తేరి గ్రామంలోని గిరిజన కాలనీలోని రోడ్డు ఆక్రమణను అడ్డుకోవాలని బుధవారం గిరిజనులు ఆర్ఐ నల్లయ్యకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ.. కాలనీలోని రోడ్డును సుబ్బయ్య అనే వ్యక్తి ఆక్రమించి, రోడ్డుపై గడ్డివామును వేశాడని తెలిపారు. రోడ్డు ఆక్రమణకు గురికావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. దీనిపై స్పందించిన ఆర్ఐ నల్లయ్య మాట్లాడుతూ.. రోడ్డు సర్వే చేసి, ఆక్రమణను తొలగిస్తామని హామీ ఇచ్చారు.

వ్యక్తి ఆత్మహత్య

నాగలాపురం : పురుగుమందు తాగి సుబ్రహ్మణ్యం (48) ఆత్మహత్యాయత్నం చేసుకోగా బుధవారం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన పిచ్చాటూరు మండలంలోని రజానగరంలో చోటు చేసుకుంది. ఎస్ఐ వెంకటేశులు తెలిపిన వివరాలు ఇలా.. సుబ్రహ్మణ్యం భార్య మృతి చెంది కొంత కాలం గడిచిపోయింది. ఉన్న ఒక్కగానొక్క కుమార్తెకు పెళ్లి కావడంతో ఒంటరిగా ఉన్న సుబ్రహ్మణ్యం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.

రివర్ షోరూమ్ ప్రారంభం



షోరూంను ప్రారంభిస్తున్న భాను ప్రకాష్ రెడ్డి, ఆర్డీవో

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : తిరుపతి-రేణిగుంట రహదారిలో బుధవారం నూతనంగా ఏర్పాటు చేసిన రివర్ షోరూమ్‌ను టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి, తిరుపతి ఆర్డీఓ మురళీకృష్ణ ప్రారంభించారు. సాస్త ఆటోమేటివ్ భాగస్వామ్యంతో షోరూమ్‌ను ప్రజలకు అందుబాటులో తెచ్చారు. భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ.. బెంగళూరుకు చెందిన ఎలక్ట్రిక్ స్కూటర్ మన రాష్ట్రంలో సేవలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. కంపెనీ ప్రతినిధి పార్థసారథి, కొనుగోలుదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పునఃపరిశీలన



వికలాంగుల సదరం సర్టిఫికెట్లు పునఃపరిశీలనలో భాగంగా తిరుపతి రుయా వైద్యశాల ఆర్థో స్పెషలిస్టు , అసిస్టెంట్ ప్రొఫెసర్ పి.జగదీశ్ పరిశీలించారు. బుధవారం సత్యవేడు కమ్యూనిటీ వైద్యశాలలో నియోజకవర్గం పరిధిలోని బుచ్చినాయుడు కండ్రిగ, కాంచనపుత్తూరు, సచివాలయాల్లో 48 మంది వికలాంగులకు సంబంధించిన సదరన్ సర్టిఫికెట్లను రుయా వైద్యులు పరిశీలించారు. కార్యక్రమంలో డిజిటల్ అసిస్టెంట్ మణికంఠ, వెల్ఫేర్ అసిస్టెంట్ హేమలత పాల్గొన్నారు. - సత్యవేడు

ప్రమాదం



రోడ్డు మీదకు వచ్చిన చెట్టుకొమ్మలు

బుచ్చినాయుడుకండ్రిగలో శ్రీకాళహస్తి వైపున కేటీ రోడ్డుకు ఆనుకుని పెద్ద చెట్టు ఉండటంతో వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది. దీంతో చెట్టు కొమ్మలు తొలగించాలని కోరుతున్నారు. వేపచెట్టు పెద్ద కొమ్మలు రోడ్డుకు అడ్డుగా ఉండటంతో భారీ వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు తరచూ ప్రమాదాలకు గురవుతున్నాయి. చెట్టుకొమ్మలు వాహనాలకు తగలడంతో వాహనాలు ధ్వంసం అవుతున్నాయి. రోడ్డుపైకి వచ్చిన చెట్టు కొమ్మలు తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు. - బుచ్చినాయుడుకండ్రిగ

నిర్లక్ష్యం



నారాయణవనంలో ఓ ప్రైవేట్ సెల్యులార్ కంపెనీ ఆప్టికల్ ఫైబర్ కేబుల్ ఏర్పాటులో భాగంగా తవ్విన గుంతలను పూడ్చకపోవడంతో పాదచారులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పుత్తూరు నుంచి పిచ్చాటూరు వరకు జాతీయ రహదారి వెంట రెండు నెలల కిందట యంత్రాల సాయంతో గుంతలు తీశారు. పనులు పూర్తయిన తర్వాత గుంతలను పూడ్చకపోగా సూచిక బోర్డులను సైతం ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రుల్లో ద్విచక్ర వాహన చోదకులు, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. - నారాయణవనం

ఉచిత బస్సు.. తుస్సు!



- అటకెక్కిన మహిళలకు ఉచిత బస్సు హామీ
- పథకానికి బడ్జెట్లో కేటాయించని నిధులు
- ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న మహిళలు

సత్యవేడు నియోజకవర్గంలో మండలాల వారీగా మహిళా ఓటర్లు

మండలం	మహిళలు
బుచ్చినాయుడుకండ్రిగ	12,984
వరదయ్యపాళెం	18,249
కేవీబీపురం	16,936
నారాయణవనం	13,737
పిచ్చాటూరు	12,573
నాగలాపురం	13,311
సత్యవేడు	19,745

వరదయ్యపాళెం : అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు గుప్పించడం, ప్రజలను వంచించడం.. అధికారంలోకి వచ్చాక ఆ హామీలను అటకెక్కించడం సీఎం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య. 2014లో ప్రజలకు 800కు పైగా హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన బాబు వాటిని అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారు. మళ్లీ 2024లోనూ అదేరీతిగా సూపర్ సిక్స్‌తో పాటు అనేక హామీలు ఇచ్చారు. ప్రధానంగా మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు సూపర్ సిక్స్‌లో ఆడబిడ్డ నిధి, ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, దీపం పథకం (ఉచిత గ్యాస్ సిలిండర్లు), తల్లికి వందనం వంటి పథకాలను చేర్చారు. కూటమి అధికారంలోకి వచ్చి 9 నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకు ఈ పథకాలు ఏవీ అమలు కాలేదు. ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకం ప్రారంభించేశామని ప్రభుత్వం గొప్పలు చెప్పుకోవడానికే తప్ప క్షేత్రస్థాయిలో ఈ పథకం అమల్లో ఉందో లేదో పాలకులకే తెలియాలి. ఆడబిడ్డ నిధి కింద 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 ఇస్తామని, మహిళలు ఆర్టీసీ బస్సుల్లో టిక్కెట్ లేకుండా ఎక్కడికైనా ప్రయాణించవచ్చని ఎన్నికల సమయంలో చంద్రబాబుతో పాటు కూటమి నాయకులు ఊదరగొట్టారు. అయితే తాజాగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన 2025- 2026 వార్షిక బడ్జెట్లో ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు పూర్తిగా మొండిచేయి చూపారు. తల్లికి వందనం, దీపం పథకానికి కూడా పూర్తి స్థాయిలో నిధులు కేటాయించలేదు. ఉచిత బస్సు ప్రయాణం, ఆడబిడ్డ నిధి పథకాలకు రూపాయి కూడా కేటాయించకుండా తమకు ఈ పథకాలు అమలు చేసే ఉద్దేశం లేదని ప్రభుత్వం చెప్పకనే చెప్పినట్లుందని మహిళలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇంకెప్పుడు అమలు చేస్తారు?



ఉచిత బస్సు, ఆడబిడ్డ నిధి పథకాలకు ప్రభుత్వం ఒక్క రూపాయి బడ్జెట్‌లో కేటాయించలేదు. ఈ పథకాలను ఇంకెప్పుడు అమలు చేస్తారో ప్రభుత్వ పెద్దలు చెప్పాలి. అధికారం కోసం ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం, ఆ తర్వాత వాటిని అటకెక్కించడం సరికాదు. ఏ పథకానికి ఎంత ఖర్చు అవుతుందన్న సంగతి ఎన్నికల్లో హామీ ఇచ్చినప్పుడు చంద్రబాబుకు తెలియదా..? అధికారం వచ్చిన తర్వాత రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని కుంటి సాకులు చెప్పడం సిగ్గుచేటు. కూటమి ప్రభుత్వం మహిళలను మోసం చేసింది.

- హెప్సీ, వరదయ్యపాళెం మండలం

హామీ ఇవ్వడం ఎందుకో ?



పథకాలను అమలు చేయడం చేతకానప్పుడు ఇష్టారీతిగా హామీలు ఇవ్వడం ఎందుకు. ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని పక్క రాష్ట్రాలు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడులో అక్కడి ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేశాయి. ఇక్కడ మాత్రం తొమ్మిది నెలలు గడిచిపోయినా ఇంకా అతీగతి లేదు. బడ్జెట్లో ఈ పథకానికి ఒక్క రూపాయి కూడా కేటాయించకపోవడం మహిళలను మోసం చేయడం కాదా?.

- బొర్రా మాధవి, వైఎస్సార్‌సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షురాలు, సత్యవేడు నియోజకవర్గం

అధ్యయనం చేశారా...?

కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ఇదిగో రేపే ప్రారంభించేస్తామన్నట్లు మీడియా ద్వారా తరచూ లీకులు ఇచ్చేది. ఒక్కో మంత్రి ఒక్కో ముహూర్తం తేదీని ప్రకటించేశారు. ఒకరు 2024 ఆగస్టు 15న ప్రారంభించేస్తామని చెబితే, మరికొందరు మంత్రులు దసరా, దీపావళి, సంక్రాంతి అంటూ తేదీలు మార్చుతూ వచ్చారు. ఆఖరుకు ఈ పథకం అమలు కోసం ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించింది. రవాణాశాఖ మంత్రి చైర్మన్‌గా, మహిళా శిశు సంక్షేమశాఖ మంత్రి, హోంమంత్రి సభ్యులుగా సబ్ కమిటీ ఏర్పాటైంది. వీరు ఉచిత బస్సు ప్రయాణం పథకం అమలవుతున్న తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, పంజాబ్, ఢిల్లీ రాష్ట్రాల్లో పర్యటించి పథకం అమలుపై అధ్యయనం చేసి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అయితే ఈ కమిటీ అధ్యయనం చేసిందో లేదో ప్రభుత్వమే చెప్పాలి. సత్యవేడు నియోజకవర్గంలో 1,07,445 మంది మహిళా ఓటర్లు ఉన్నారు. వీరంతా ఉచిత బస్సు ప్రయాణం పథకాన్ని ప్రభుత్వం ఎప్పుడు అమలు చేస్తుందా అని ఆశగా ఎదురు చూస్తున్నారు.

మూడోసారి!

- వేలంపాట.. జరిగేనా?

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్) : రేణిగుంట ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న పంచాయతీ వేలం పాట ఈ సారైనా జరుగుతుందా లేదా మళ్లీ వాయిదా పడుతుందా అనేది ప్రశ్నార్థకంగా మారింది. రేణిగుంట మేజర్ పంచాయతీ వేలంపాట నాలుగు నెలల వ్యవధిలో రెండు సార్లు వాయిదా పడి మూడోసారి ముచ్చటగా 22వ తేదీ శనివారం నిర్వహించేందుకు పంచాయతీ అధికారులు సన్నద్ధం అయ్యారు. దీనికి సంబంధించి 17వ తేదీ షెడ్యూల్ విడుదల చేశారు. ఈనెల 15వ తేదీన 'వేలం ఎప్పుడు వేస్తారు సారూ' అనే కథనంతో సాక్షిలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు 22వ తేదీ వేలం నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. రెండుసార్లు కూటమి నాయకుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో వాయిదా వేశారు. మళ్లీ డీడీలు కట్టి వాయిదాలు పడితే ఎలా అని వేలంపాటలో పాల్గొనేవారు ఆలోచనలో ఉన్నారు. ఈసారైనా ఎలాంటి ఒత్తిళ్లు లేకుండా పంచాయతీ అధికారులు వేలం పాట నిర్వహించాలని స్థానికులు కోరుతున్నారు.

'అవని' మహిళలకు వరం

సత్యవేడు : కేంద్ర సహకార బ్యాంకు కొత్తగా తీసుకొచ్చిన 'అవని' డిపాజిట్ పథకం మహిళలకు వరమని డీసీసీ బ్యాంకు మేనేజర్ కార్తీక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అవని డిపాజిట్ పథకం కేవలం మహిళలకు మాత్రమే వర్తిస్తుందన్నారు. ఇందులో డిపాజిట్ చేసుకున్న వారికి అత్యధికంగా 8.30 శాతం వడ్డీ లభిస్తుందన్నారు. సీనియర్ సిటిజన్ మహిళలకు 8.40 శాతం వడ్డీ వస్తుందన్నారు. పథకం కాల పరిమితి 333 రోజులుగా నిర్ణయించారన్నారు. కనిష్ఠ డిపాజిట్ రూ.10 వేల నుంచి స్వీకరిస్తారని చెప్పారు. డీసీసీ బ్యాంకులో అవని పథకం డిపాజిట్ సొమ్ము కు ఇన్సూరెన్సు రక్షణ ఉందన్నారు. మార్చి 31వతేదీ ఈ పథకానికి తుది గడువని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మేనేజర్ కోరారు.

హైస్కూల్‌లో స్టెమ్ ల్యాబ్ ప్రారంభం



ముచ్చివోలులో ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న కేవీ రమణ

రేణిగుంట : క్రై సంస్థ సహకారంతో తిరుపతి ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం స్టెమ్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ప్రగతి సంస్థ డైరెక్టర్ కేవీ రమణ చేతుల మీదుగా ల్యాబ్‌ను ప్రారంభించారు. పిల్లల్లో సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్ , మ్యాథమేటిక్స్‌పై ఆసక్తి పెంచడమే లక్ష్యంగా రూ.7 లక్షల వ్యయంతో ఈ ల్యాబ్‌ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇందులో మోడల్స్ 100, బ్యాక్ డ్రాప్స్ 100, సైడ్ స్లాబ్స్ 16, డెకొరేటివ్ ఫ్లెక్సీస్ 4, ఎలక్ట్రికల్ పాయింట్స్ 5, స్టికర్స్ ఒక సెట్టు, సైంటిస్ట్ ఫ్లెక్సీస్ 10, నేమ్ ప్లేట్ 1, 3డి ప్రింటర్ - ఫిలమెంట్ 1, 3డి పెన్ 1, వి ఆర్ సెట్ 1, రోబోట్స్ - సెన్సార్ క్లయర్కెట్స్ 10 ఇవ్వడం జరిగిందని తెలిపారు. వీటిని ఏర్పాటు చేయడం ద్వారా ఈ ప్రాంతాల్లో ఉత్తీర్ణత శాతం పెరిగి, డ్రాపౌట్లు, బాల కార్మికులు, బాల్యవివాహాలు తగ్గుతాయని ఆశిస్తున్నట్లు ఆయన వివరించారు. గ్రామ సర్పంచ్ నరసింహారెడ్డి మాట్లాడుతూ.. ప్రయోగాత్మక బోధనకు ఉపయోగకరమైన స్టెమ్ ల్యాబ్‌ను పాఠశాలకు అందించిన దాతలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ భువనేశ్వరి, హెచ్‌ఎం రమేష్‌బాబు, ఎస్‌ఎంసీ చైర్మన్ ముని రామయ్య, ప్రగతి సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ నారాయణ, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజుష, ప్రగతి సిబ్బంది ప్రభాకర్, జయలక్ష్మి, శిరీష, బోస్ పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరం



వైద్య పరీక్షలకు హాజరైన మహిళలు

శ్రీకాళహస్తి : రాస్ , టాటా ట్రస్ట్ క్యాన్సర్ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని ఎన్టీఆర్ నగర్ రాస్ క్లస్టర్ ఆఫీస్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫీల్డ్ ఆఫీసర్లు దేవకి, సుచిత్ర హాజరై ప్రారంభించి మాట్లాడుతూ.. తమ బ్యాంకు ద్వారా మహిళలకు మాత్రమే జీవన సమృద్ధి ఖాతా ఓపెన్ చేసుకొని 15 వేల రూపాయల నిల్వ తమ ఖాతాలోనే ఉంచుకోగలిగితే క్యాన్సర్‌కు రూ.10 లక్షలు , యాక్సిడెంటల్‌కు రూ.5 లక్షల వరకు బీమా ఉచితంగా ఉంటుందని తెలిపారు. అనంతరం టాటా ట్రస్ట్ ప్రోగ్రాం మేనేజర్ హేమంత్ కుమార్ మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను ఆదిలోనే గుర్తించకపోతే ఎన్నో సమస్యలకు గురికావాల్సి వస్తుందన్నారు. రాస్ ద్వారా అందించే ఈ సేవలు అన్నింటిని సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వైద్య శిబిరంలో పాల్గొన్న మహిళలు, పురుషులకు రక్తపోటు, మధుమేహం , నోటి క్యాన్సర్ ,రొమ్ము క్యాన్సర్ , గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించి అన్ని పరీక్షలను ఉచితంగా చేశారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ డాక్టర్ వెంకయ్య బాబు, రెడ్డికుమారి, వినీత, మహేంద్ర, రాస్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్ , వినోద్, ముఖేష్ తదితరులు పాల్గొన్నారు.

పన్నులతో గ్రామాభివృద్ధి

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని పంచాయతీల్లో ఇంటి పన్ను సకాలంలో చెల్లించాలని సూళ్లూరుపేట డీఎల్‌పీ రవీంద్రబాబు తెలిపారు. బుధవారం బుచ్చినాయుడుకండ్రిగలోని మెయిన్‌రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణ యజమానులకు నోటీసులు అందించి, పన్ను వసూలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఇంటి పన్ను తప్పనిసరిగా చెల్లించాలని, పన్నుతో గ్రామాభివృద్ధి సాధ్యం అవుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామన్నారు. పంచాయతీల్లో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, వీధిలైట్లు నిర్వహణలపై దృష్టి పెట్టి, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామన్నారు. అనంతరం బుచ్చినాయుడుకండ్రిలో నగదు రహిత ఇంటి పన్ను వసూలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ రాజశేఖర్, గ్రామ కార్యదర్శి సుబ్రమణ్యం, పాల్గొన్నారు.

బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు

శ్రీకాళహస్తి : బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపి అన్నారు. పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని ఖాళీ స్థలంలో బుధవారం బహిరంగ మద్యపానం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. స్థానికులతో కలిసి పరిసరాలను పరిశుభ్రం చేశారు. ఈ ప్రాంతంలో బహిరంగ మద్యపానం నిషేధం ఉందన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పరామర్శ



జయరామ్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : పట్టణానికి చెందిన టౌన్ బ్యాంకు మాజీ డైరెక్టర్ ఆవుల జయరామ్ ఇటీవల మరణించారు. బుధవారం ఆయన స్వగృహంలో కర్మ క్రియలు జరిగాయి. మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పాలక మండలి మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, నాయకులు పటాన్ ఫరీద్, శరవన్, ఉదయ్‌కుమార్, రాయల్, జయశ్యామ్, జీవీకే రెడ్డి, ఆశా కిరణ్ పాల్గొన్నారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు



మాట్లాడుతున్న ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి : లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆర్డీఓ భానుప్రకాష్‌రెడ్డి అధ్యక్షతన ఉప జిల్లా స్థాయి మల్టీ మెంబర్ అప్రోప్రియేట్ అథారిటీ కమిటీ సమావేశం , ఉప జిల్లా స్థాయి సలహా కమిటీ సంయుక్త సమావేశాన్ని నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. శ్రీకాళహస్తి పరిధిలో కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో లింగ నిష్పత్తి తక్కువగా ఉందని పేర్కొన్నారు. ఎలాంటి స్కాన్ సెంటర్ అయినా లింగ నిర్ధారణ చేస్తున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ మృదులవాణి, ఏరియా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ మధు, వైద్యులు కిరణ్ కుమార్, సీడీపీఓ శాంతి దుర్గ, లీగల్ అడ్వైజర్ ఇంద్రాణి, ఎన్జీఓలు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పంచాయతీకి రూ.16 లక్షల ఆదాయం

- వరదయ్యపాళెంలో పోటాపోటీగా వేలం



వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

వరదయ్యపాళెం : మండల కేంద్రమైన వరదయ్యపాళెం మేజర్ పంచాయతీ పరిధిలో పంచాయతీకి చెందిన లీజుల వేలం పాటకు పెద్దఎత్తున పోటీ నెలకొంది. బుధవారం సూళ్లూరుపేట డీఎల్‌పీఓ సీహెచ్ రవీంద్రబాబు అధ్యక్షతన వేలం పాట నిర్వహించారు. మొదటిగా పంచాయతీ పరిధిలోని 25 గదులకు వేలం నిర్వహించారు. అందులో 18 గదులకు సంబంధించి లీజుదారులు వేలం పాటలో పాల్గొనగా మిగిలిన 7 గదులకు సంబంధించి శుక్రవారం వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ ఈఓ బసిరెడ్డి తెలిపారు. అనంతరం పంచాయతీ పరిధిలోని బస్టాండ్, కూరగాయల మార్కెట్, జంతువధశాలలకు జరిగిన వేలంలో పోటాపోటీగా లీజుదారులు పాల్గొని గతేడాది కంటే రెట్టింపుగా వేలం పాట పాడి స్వాధీనం చేసుకున్నారు. ఆ మేరకు గత ఏడాది రూ.11,53,600 రాగా ఈ ఏడాది జరిగిన వేలం పాటలో రూ.16,55,300 పంచాయతీకి ఆదాయం సమకూరిందని ఈఓ బసిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ చిరంజీవి, సర్పంచ్ జ్యోతి, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

లీజులు మూడేళ్లకోసారి నిర్వహించాలి

వరదయ్యపాళెం : వరదయ్యపాళెం మేజర్ పంచాయతీలో ఏడాదికోసారి నిర్వహించే వేలం లీజు కాల పరిమితిని మూడేళ్లకు కేటాయించాలని స్థానిక లీజుదారులు సూళ్లూరుపేట డీఎల్‌పీఓ సీహెచ్ రవీంద్రబాబుకు బుధవారం స్థానిక లీజుదారులు వినతిపత్రం అందజేశారు. లీజు పరిమితిని ఏడాదికి కేటాయించడంతో ఇబ్బందికరంగా ఉందని లీజుదారులు వాపోయారు. వేలంలో పాడుకున్న గదులు , బస్టాండ్, కూరగాయల మార్కెట్, జంతు వధశాలలకు సంబంధించి ఇబ్బందులు తలెత్తుతున్నాయని, కనీస సమయం మూడేళ్లపాటు కేటాయిస్తే లీజుదారులకు ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.